సాక్షి
కుమురం భీం

శుక్రవారం, 14, జూన్, 2024



ప్రాణదాతలు..!
అత్యవసర సమయాల్లో రక్తదాతలు బాధితుల ప్రాణాలు నిలుపుతున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
8లో▸



చిగురిస్తున్న ఆశలు
రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు బ్యాంకుల వారీగా అర్హుల జాబితా సేకరిస్తున్నారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
37.5 /28.8

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించని ఏజెన్సీలను ఎం ప్యానల్‌లోకి తీసుకోవద్దని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించకుండా వారి నెలవారీ వేతనాల నుంచి కట్టినట్లు చూపిస్తున్నాయని ఆరోపించారు. దీంతో కార్మికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించని ఏజెన్సీలపై విచారణ చేపట్టాలని కోరారు.

ఆశవర్కర్లకు రాత పరీక్ష సరికాదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశ వర్కర్లకు నష్టం కలిగించే విధంగా రాత పరీక్ష నిర్వహించాలనే నిర్ణయం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు ఇస్తున్న పారితోషికం రూ.18 వేలకు పెంచాలని, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని, లెప్రసీ సర్వే డబ్బులు, పల్స్ పోలియో కార్యక్రమం నగదు చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు పద్మ, బద్రుబాయి, ఓమల, లక్ష్మి, నవీన, అరుణ, అనిత, సునీత ఉన్నారు.

జాడ లేని వాన..!



దహెగాం శివారులో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

- ఇప్పటికీ జిల్లాలో 40 డిగ్రీలకు చేరువగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- జూన్ సగం పూర్తయినా కురవని భారీ వర్షాలు
- జిల్లాలోని 11 మండలాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే..
- దుక్కి దున్ని విత్తనాలు విత్తుతున్న రైతులు

ఆసిఫాబాద్: జూన్ దాదాపు సగం పూర్తయింది. ఈ నెల మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకాల్సి ఉండగా, రెండో వారం నుంచి తొలకరి వర్షాలు కురుస్తుంటాయి. అయినా ఇప్పటివరకు వాన జాడ కానరావడం లేదు. జోరుగా వర్షాలు కురవాల్సిన సమయంలో జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల చేరువలో నమోదవుతున్నాయి. గురువారం తిర్యాణిలో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చుతుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేసవి మాదిరిగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలర్లు, ఏసీలకు అతుక్కుపోతున్నారు.

సాగుకు సమాయత్తం

మే చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేస్తారు. భారీ వర్షం కురిసిన తర్వాత విత్తనాలు విత్తాల్సిన రైతులు ముందుగానే విత్తనాలు వేస్తున్నారు. గతంలో ఈ సమయానికి పత్తి సాగు సగం వరకు పూర్తయ్యేది. వర్షాలు లేకున్నా చాలాచోట్ల ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తుకుని వరుణుడిపై భారం వేశారు. ఈ ఏడాది 4,52,448 ఎకరాల్లో వానాకాలం పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,020 పెంచడంతో ఈ సారి కూడా పత్తివైపే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. గత నెల చివరి వారం నుంచే రైతులు విత్తనాల కొనుగోళ్లు ప్రారంభించగా, 80 శాతం మంది విత్తనాలు కొనుగోలు పూర్తి చేశారు. రైతులు పత్తివైపే మొగ్గు చూపడంతో మార్కెట్‌లో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. కొంత మంది వ్యాపారులు బ్రాండెడ్ కంపెనీ విత్తనాలను ఎమ్మార్పీకి మించి రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారు.

ఆరుతడి పంటలే ఎక్కువ

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. అసంపూర్తి కాల్వలతో పంట పొలాలకు బీళ్లుగా మారుతున్నాయి. ఏటా జిల్లా రైతులు ఆరుతడి పంటలే సాగు చేస్తున్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు జిల్లాలో ఇప్పటికే 60 శాతం పత్తి విత్తనాలు వేసుకున్నారు. మరికొందరు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. మరో వారం వరకు వేచి చూస్తామనే ధోరణిలో ఉన్నారు. పోతే విత్తనాలు నష్టం.. వర్షం వస్తే మొలకలు వస్తాయనే ఆశతో ఉన్నారు. వానలు రాక పోతే మరోమారు విత్తనాలు విత్తడం తప్పదు. అకాల వర్షాల నుంచి పంటలను రక్షించేందుకు గతేడాది నుంచి ప్రభుత్వం ముందస్తు సాగు విధానం ప్రవేశపెట్టినప్పటికీ జిల్లాలో ముందస్తు సాగుకు వాతావరణం అనుకూలించలేదు.

వర్షం కోసం ఎదురుచూపులు

సాధారణంగా తొలకరి వర్షాలు జూన్ మొదటి వారంలోనే ప్రారంభమవుతాయి. తొలకరి జల్లులతో రైతులు ఏరువాక పనులు మొదలు పెట్టి విత్తనాలు విత్తుకుంటారు. ఈ ఏడాది జూన్ రెండో వారం వరకు కూడా వర్షాలు పడటం లేదు. సాధారణంగా జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 41.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే జైనూర్, సిర్పూర్(యూ) మండలాల్లో మాత్రమే స్వల్పంగా వర్షాలు కురిశాయి. ఇప్పటి వరకు కేవలం 32.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 22 శాతం లోటు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, కెరమెరి, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల మండలాల్లో ఇప్పటివరకు వర్షం జాడే లేదు. 11 మండలాల్లో లోటు కనిపిస్తోంది. ఈ నెల 15 నుంచి 18 వరకు నైరుతి రుతుపవనాలు జిల్లాలో విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు.

వానాకాలం సాగు అంచనా

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	3,40,000
వరి	59,212
జొన్న	680
మొక్కజొన్న	742
కంది	38,239
పెసర	1,700
మినుము	163
వేరుశనగ	178
సోయాబీన్	6,089
ఇతర పంటలు	2,152



జూన్ 1 నుంచి 13 వరకు వర్షపాతం లోటు

జూన్‌లో లోటు వర్షపాతం ఇలా..

మండలం	లోటు(శాతం)
రెబ్బెన	89
వాంకిడి	88
కెరమెరి	87
తిర్యాణి	82
కాగజ్‌నగర్	80
సిర్పూర్(టి)	73
ఆసిఫాబాద్	62
కౌటాల	51
దహెగాం	30
పెంచికల్‌పేట్	26
జైనూర్	8

తొందరపడి విత్తనాలు వేయొద్దు

తగినంత వర్షం పడ్డాకే పత్తి విత్తనాలు విత్తాలి. జూన్ మొదటి వారం పూర్తయినప్పటికీ జిల్లాలో ఇప్పటికీ ఎండల తీవ్రత కొనసాగుతుంది. ఎండల్లో తొందర పడి విత్తనాలు పెట్టవద్దు. కనీసం 60 నుంచి 70 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలు విత్తాలి. భూమి చల్లబడాలి. ఎండల్లో విత్తనాలు విత్తిన విత్తనాలు భారీ వర్షం కురిస్తే కుళ్లిపోయే అవకాశం ఉంటుంది.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణమే శరణ్యం



ప్రాణహిత ప్రాజెక్టు కాలువలు పరిశీలిస్తున్న సభ్యులు, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం(సిర్పూర్): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ ఆనకట్ట కుంగడంతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడమే శరణ్యమని హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం సభ్యులు సూచించారు. దహెగాం మండలం కమ్మర్‌పల్లి శివారు నుంచి వెళ్తున్న ప్రాణహిత ప్రాజెక్టు కాలువలను గురువారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మేడికడ్డ ఆనకట్ట కుంగడంతో తుమ్మిడిహెట్టి వద్ద వెంటనే బ్యారేజీ నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సీఎంను కలుస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలని సూచించారు. తద్వారా ఎల్లంపల్లి నుంచి దిగువన నిర్మించిన రిజర్వాయర్లను నింపుకోవచ్చని పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బ్యారేజీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ప్రతినిధులు భీమయ్య, పుల్లారెడ్డి, శ్రీరాంరెడ్డి, వెంకటయ్య, హన్మంతరెడ్డి, వెంకటరమణ, రవీంద్రనాథ్ ఉన్నారు.

తెలుగు పాఠ్య పుస్తకాలు వాపస్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన తెలుగు పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ అధికారులు వాపస్ తీసుకుంటున్నారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రుల పేర్లు ఉండటమే ఇందుకు కారణం. ముందుమాటలో.. పాఠ్యపుస్తకాల రూపకల్పన కోసం ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు అని ముద్రించి ఉంది. తెలుగు పాఠ్య పుస్తకాలను తిరిగి ఎమ్మార్సీ కార్యాలయాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఉపాధ్యాయులు తిరిగి పంపిస్తున్నారు. డీఈవో అశోక్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠ్యపుస్తకాలు తిరిగి తీసుకుంటున్నామని తెలిపారు. ముందుమాట ఉన్న పేజీని తీసేసిన తర్వాత తిరిగి అప్పగిస్తామన్నారు.

ముగ్గురి ఊపిరి తీసిన ప్రహరీ



శంకర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న కూలీలు



పోషం మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు



హన్మంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- గోడ కూలి కూలీల మృత్యువాత
- జేసీబీతో రెండు గంటలు శ్రమించి మృతదేహాలు వెలికితీత
- ఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, సీపీ
- న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్
- భవన నిర్మాణ అనుమతి రద్దుకు అదనపు కలెక్టర్ ఆదేశాలు



ఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం/చింతలమానెపల్లి: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ముగ్గురు కూలీల ప్రాణాలు మట్టిలో కలిశాయి. పనులు చేస్తుండగా ఒక్కసారిగా ప్రహరీ కూలి మీద పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరొకరు గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు రెండు గంటలపాటు శ్రమించి జేసీబీ, డ్రిల్లర్ సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో నందిని ఆస్పత్రి వైద్యురాలుకు చెందిన నూతన భవన నిర్మాణ పనులకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంత్(35), బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్(40), చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం(50), కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన మైదం రాములు, మరో ఇద్దరు కూలీలు వెళ్లారు. పిల్లర్ల మధ్యలో మట్టి, బండలు నింపుతుండగా సెల్లార్‌కు పక్కనే ఇతరులకు చెందిన శిథిలావస్థలో ఉన్న ప్రహరీ కూలి పోషం, శంకర్, హన్మంత్‌లపై పడడంతో దాని కింద నలిగిపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందారు. రాములును మరో ఇద్దరు కూలీలు బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలపై పూర్తిగా మట్టి కూరుకుపోవడంతో స్థానిక సీఐ బన్సిలాల్, సిబ్బందితోపాటు జేసీబీ సహాయంతో రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఘటన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఘటన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాష్ పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతి రద్దు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను ఆదేశించారు.

న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్

కార్మికులకు రక్షణ కరువైందని, మృతులు పోషం, హన్మంతు, శంకర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సెల్లార్ నిర్మాణానికి అనుమతులు లేవని ఆరోపించారు. భవనం యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో బిడ్డ పెళ్లి.. అంతలోనే మృతి

చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంతు స్వగ్రామంలో కుమ్మరి పని చేసేవాడు. కులవృత్తిలో ఉపాధి లభించక కుటుంబంతో సహా మంచిర్యాల పట్టణంలో భార్య లక్ష్మి, కుమారుడు రాజేష్‌తో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. పని చేస్తేనే వీరి పొట్ట గడిచే పరిస్థితి. స్వగ్రామం రుద్రాపూర్‌లో వృద్ధులైన తల్లిదండ్రులు మారయ్య, బాయక్క ఉన్నారు. ఇటీవల కూతురు శివానికి పెళ్లి కుదిరింది. త్వరలో పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంతలోనే కుటుంబ పెద్ద హన్మంతు మృతితో విషాదం నెలకొంది.

కూలీకి వెళ్తేనే కడుపు నిండేది..

చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం కుటుంబానిది రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. బాబాసాగర్ గ్రామానికి చెందిన పోషం అక్కడి నుంచి చింతలమానెపల్లికి వలస వచ్చాడు. ఆర్థికంగా నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. భార్య గంగతో కలిసి కూలీ పనులు చేసేందుకు మంచిర్యాలకు వచ్చాడు. కుమారుడు శేఖర్ హైదరాబాద్‌లో పని చేస్తూ చదువుకుంటున్నాడు. బుధవారం ఎల్లారంలో మొక్కులు తీర్చుకున్న పోషం భార్య గంగ, కుమారుడు శేఖర్ ఇంటికి వచ్చారు. పోషం మంచిర్యాలకు వెళ్లి గురువారం సాయంత్రం మృత్యువాత పడ్డాడు.

భూమి లేక వలస

బాబాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం శంకర్‌కు సోదరులు మల్లేష్, దుర్గాజీ ఉన్నారు. మల్లేష్ ఉపాధి కోసం మరో గ్రామానికి వెళ్లగా శంకర్, దుర్గాజీ గ్రామంలోనే నివాసం ఉండేవారు. జీవనం సాగించడానికి వీరి వద్ద ఉన్న భూమి సరిపోకపోవడంతో తమ్ముడు దుర్గాజీకి భూమి అప్పగించి భార్యాపిల్లలతో శంకర్ మందమర్రి మండల కేంద్రంలో ఉంటున్నాడు. మంచిర్యాలలో కూలీ పనికి వచ్చి వెళ్తుండేవాడు. భార్య ధనలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు సిరివెన్నెల, హర్షితరాణిలతో నివాసం ఉంటున్నాడు. కూలీ డబ్బులతో పిల్లలను చదివిస్తున్నాడు.

‘భగీరథ’పై సమగ్ర సర్వే

- తాగునీటి సరఫరాపై క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్న ప్రభుత్వం
- నల్లా కనెక్షన్లు, పైప్‌లైన్లు, తదితర వివరాలు సేకరణ
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు
- శిక్షణ పొందిన బృందాలతో కొనసాగుతున్న సర్వే





ప్రభుత్వం రూపొందించిన యాప్

వాంకిడి మండలం ఖమాన గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది

వాంకిడి(ఆసిఫాబాద్): మారుమూల గ్రామాల్లోనూ నీటిఎద్దడి లేకుండా ఇంటింటికీ శుద్ధ జలం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి ప్రతీ పల్లెలో ట్యాంకుల నిర్మాణం చేపట్టింది. ఇంటింటికీ పైప్‌లైన్లు వేసి నల్లాలు బిగించేందుకు తీసుకుంది. అయితే ప్రారంభించి ఎనిమిదేళ్లు కావొస్తున్నా పథకం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో పథకం ప్రారంభం నుంచే నీటి సరఫరా కావడం లేదు. మరికొన్ని చోట్ల అడపాదడపా నీటిని సరఫరా చేస్తూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే లీకేజీలు అధికంగా ఉండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ వేసవిలోనూ అనేక గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తిన విషయం తెలిసిందే. మిషన్ భగీరథ పథకం ఏమేరకు పని చేస్తుందో తెలుసుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టింది. సోమవారం నుంచి ప్రారంభమైన సర్వే పది రోజుల్లో పూర్తి కానుంది. సిబ్బంది యాప్‌లో వివరాలు నమోదు చేసి, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పథకం అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లా, మండలస్థాయి అధికారులు, మిషన్ భగీరథ అధికారులకు హైదరాబాద్‌లో సర్వే నిర్వహణపై ఒకరోజు శిక్షణ అందించారు. అక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సర్వే ఎలా నిర్వహించాలి.. వివరాలు నమోదు, ఏఏ అంశాలను తీసుకోవాలి.. ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. మండలాల్లోని జీపీల వారీగా పంచాయతీ కార్యదర్శితో కూడిన శిక్షణ పొందిన బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నాయి.

జిల్లాలో తాగునీటి సరఫరా అంతంతే..

అయితే జిల్లాలో మిషన్ భగీరథ పథకం మొదటి నుంచి విమర్శల పాలవుతుంది. జిల్లా కేంద్రంలోనూ రోజుల తరబడి తాగునీటి అంతరాయంపై స్వయంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి పలు సమావేశాల్లో ప్రస్తావించారు. ఇక ఏజెన్సీలోని పలు గ్రామాల్లో వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. పథకం తీరుతెన్నులు పరిశీలిస్తే.. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ సమీపంలో 1, 2 ఫేజ్ ద్వారా రూ.1650 కోట్లతో నీటిశుద్ధి కేంద్రాలు నిర్మించారు. మొత్తం 1,151 ఆవాసాలకు తాగునీటిని అందించాల్సి ఉంది. రూ.115 కోట్ల నిధులతో 115 ఎంఎల్‌డీల నీటిశుద్ధి కేంద్రం నిర్మించారు. ఇక్కడి నుంచి కుడివైపు 10 మండలాల్లోని 622 ఆవాసాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ఎడమవైపు ధనోర వద్ద 12, 30 ఎల్ఎండీ నీటిశుద్ధి కేంద్రం నుంచి ఐదు ఏజెన్సీ మండలాల్లోని 479 ఆవాసాలకు తాగు నీటిని అందించాలి. పథకంలో భాగంగా 1746 కిలోమీటర్ల పైప్‌లైన్ వేశారు. మిషన్ భగీరథ(ఇంట్రా విలేజ్) కింద మరో 1,233.90 కి.మీ.ల పైప్‌లైన్ మంజూరు చేశారు.

నీళ్లు వస్తున్నాయా.. లేదా..?

మిషన్ భగీరథ పథకం స్థితిగతులపై సేకరిస్తున్న సమగ్ర వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పది రోజులపాటు గ్రామాల వారీగా సర్వే చేపట్టనుండగా.. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా? నల్లా కనెక్షన్ ఉందా? నల్లా పని చేస్తుందా? పైప్‌లైన్ సక్రమంగా ఉందా? పైపుల ద్వారా నీరు వస్తున్నాయా? ఎన్ని రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయి? ఎన్ని లీటర్లు వస్తాయి? ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా..? అని లబ్ధిదారులను అడుగుతున్నారు. అలాగే ఈ పథకం ప్రజలకు సానుకూలంగా ఉందా లేదా..? అని ఆరా తీస్తున్నారు. లబ్ధిదారు పేరు, చిరునామా, తల్లి/తండ్రి లేదా భర్త పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, మొబైల్ నంబర్, ఆధార్ సంఖ్య, కులం తదితర వివరాలు నమోదు చేసుకుంటున్నారు. చివరగా లబ్ధిదారుతో కలిపి ఇంటి ఫొటో, నల్లా ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పది రోజుల్లో సర్వే పూర్తి

జిల్లాలో ఈ నెల 10 నుంచి మిషన్ భగీరథ పథకంపై సర్వే ప్రారంభించాం. పథకం అమలు, తాగునీటి సరఫరా, క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. ప్రత్యేక యాప్‌లో సిబ్బంది వివరాలు నమోదు చేస్తున్నారు. మొత్తం పది రోజుల్లో సర్వే పూర్తవుతుంది. పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, అంగన్‌వాడీ, ఈజీఎస్ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు.

– భిక్షపతి, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

ఈపీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఈ నెల 18 నుంచి శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల డ్రైవింగ్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆయా డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 వరకు ఈపీ ఆపరేటర్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, అభ్యర్థులు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో వీడియో చిత్రీకరణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవింద రావు, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సర్వే అధికారి వెంకటేశం, ఇంచార్జి సివిల్ డీజీఎం రాము పాల్గొన్నారు.

ఇంటి రుణం వడ్డీ చెల్లింపులపై ఆంక్షలు ఎత్తివేత

శ్రీరాంపూర్: సింగరేణిలో ఇంటి రుణం తీసుకున్న వారికి కంపెనీ చెల్లించే రుణంపై వడ్డీ చెల్లింపుల్లో ఉన్న ఆంక్షలు ఎత్తివేసినట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఇంటి నిర్మాణం లేదా ఇంటిని కొనుగోలు చేసి బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నప్పుడు ఆ రుణం ఒక ఏడాదిలోపు తీసుకుంటేనే వడ్డీ చెల్లించే వారని, ఇప్పుడు ఆ నిబంధన ఎత్తివేశారని పేర్కొన్నారు. 8.33శాతం కంటే తక్కువ వడ్డీ ఉన్న బ్యాంకుల్లో రుణం తీసుకుంటే వారికి కంపెనీ 6 లేదా 7శాతం మాత్రమే వడ్డీ చెల్లించేదని, దీన్ని కూడా ఎత్తివేశారని తెలిపారు. తాము సింగరేణి యాజమాన్యంతో చర్చించి కార్మికుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరగా ఆంక్షల ఎత్తివేత ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి పిడుగుపాటుకు బలి

తానూరు: బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి పదేళ్ల క్రితం వచ్చిన ఓ వ్యక్తి నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వత్ గ్రామంలో ఓ రైతువద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనులు ముగించుకుని వస్తుండగా పిడుగుపాటుతో మృతిచెందాడు. ఏఎస్సై శామ్యూల్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్ తాలూక పాకి గ్రామానికి చెందిన జాదవ్‌రామ్(45) పదేళ్ల క్రితం ఎల్విత్ గ్రామానికి వచ్చాడు. పాలేరుగా పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఎడ్లబండిపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంతో ఉరుములు, మెరుపులతో కుడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఎడ్లబండిపై నుంచి కిందపడి మృతిచెందాడు. రాదవ్ రామ్ భార్య రుణుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇరువర్గాల మధ్య గొడవ

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ వద్ద గురువారం సాయంత్రం పశువులు తరలిస్తున్న వాహనం ఆపిన విషయంలో రెండువర్గాల మధ్య గొడవ జరిగింది. అనుమతి లేకుండా పశువులను తీసుకెళ్లవద్దని ఒకవర్గం యువకులు పశువులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకవర్గం యువకులపై మరో వర్గం యువకులు దాడి చేశారనే విషయం బైటకు రావడంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను పిలిపించి రెండువర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. ముందస్తుగా వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి కేసులు నమోదు చేయనున్నట్లు ఇచ్చోడ సీఐ భూమేశ్ తెలిపారు.



రక్తదానం చేస్తున్న దాతలు(ఫైల్)

ప్రాణదాతలు..!

- ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాతలు
- ఆపదలో ఉన్న వారికి అండగా..
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

మంచిర్యాలటౌన్: 'అన్ని దానాల్లో కెల్లా రక్తదానం మిన్న', 'రక్తదానం.. మహాదానం' అంటూ ఎన్ని ప్రచారాలు చేసినా కొందరిలోనే స్పందన కనిపిస్తోంది. రక్తదానం చేయాలని ఉన్నా కొన్ని అపోహలు, మనకెందుకులే అనే భావనతో చాలామంది వెనుకంజ వేయాల్సి వస్తోంది. ఇప్పటికే అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడం లేదు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మేమున్నాం అంటూ కొందరు రక్తాన్ని దానం చేయడంతోపాటు పలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ, అపాయంలో ఉన్నవారికి రక్తం అందేలా చూస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆదుకుంటూ మేమున్నామంటూ భరోసాను ఇస్తున్నారు. రక్తదానం చేసే దిశగా పలువురిని ప్రోత్సహిస్తున్నారు. ఆస్ట్రియన్ అమెరికన్ జీవశాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టెయినర్ మానవ రక్తకణాలు కనుగొన్నందుకు గాను వైద్యశాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా, రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతియేటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఎలా చేయాలంటే..

ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్లడ్ బ్యాంకులో, వారు నిర్వహించే శిబిరాల్లో రక్తదానం చేయవచ్చు. మధుమేహం, రక్తపోటుతో బాదపడుతున్న వ్యక్తులు రక్తం ఇవ్వకుండా ఉండాలి. కంటిజబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు. చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, ఇతర వైరల్ వ్యాధులు సోకిన వారు నయమైన తర్వాత నాలుగు నుంచి ఆరు నెలలు గడిచాక మాత్రమే రక్తదానం చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండి 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగి 50 కిలోలకు మించిన బరువున్న వారు రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసే వారి నుంచి 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు. రక్తాన్ని ఇచ్చే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల రక్తాన్ని తీసుకోరు.

ప్రాణంతో సమానం రక్తం

ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా సృష్టించలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. రక్తాన్ని మనం తయారు చేసుకోలేం, ఒకరి రక్తం మరొకరి ఆయుష్షును కాపాడుతుందని తెలిసినా రక్తదానం చేయడంలో చాలామంది ముందుకు వచ్చేందుకు భయపడుతున్నారు. రక్తదానం చేయడం వల్ల ఏదైనా హాని ఉంటుందని కొందరు భయం, అపోహ పడుతుంటే, మరికొందరు ఎప్పుడు రక్తం అవసరం వచ్చినా మేమున్నాం తోడుగా అంటూ స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ, పలువురితో రక్తదానం చేయిస్తున్నారు.

స్వచ్ఛందంగా కొందరు కూడా రక్తదానం చేయకపోతే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం దొరకని పరిస్థితి నెలకొంటుంది. అందుకే ఈ రక్తదాతలు చెప్పేది ఒక్కటే, అపోహలు వద్దు, రక్తదానం చేద్దాం.. మరో ప్రాణాన్ని కాపాడుదాం అంటూ ముందుకు వెళ్తున్నారు.

36 సార్లు రక్తదానం



ఆసిఫాబాద్‌అర్బన్: ఇప్పటి వరకు 36 సార్లు రక్తదానం చేశాను. గత 15 ఏళ్లుగా రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించాను. ప్రతీ వ్యక్తి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి. రక్తదానం చేసిన రోజు నాకు సంతోషంగా ఉంటుంది.

– వైరాగడే ప్రతాప్, ఆసిఫాబాద్

ఆరోగ్యం మెరుగు



ఆసిఫాబాద్‌అర్బన్: రక్తాన్ని దానం చేయడంతో ఆరోగ్యం గతంలో కంటే ప్రస్తుతం మెరుగుగా ఉంటుంది. ఇప్పటివరకు 32 సార్లు రక్తాన్ని ఇచ్చాను. ఈ సంఖ్య 100కు చేరేందుకు కృషి చేస్తున్నాను. రక్తదానం చేసేందుకు ఇతరులకు అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో తృప్తినిస్తుంది.

– ఎండీ మొయినొద్దీన్, ఆసిఫాబాద్

పదేళ్లుగా చేస్తున్నా..



గత పదేళ్లుగా రక్తదానం చేస్తూ, అత్యవసరమైన వారికి రక్తదానం చేస్తున్నాను. అత్యధికసార్లు రక్తదానం చేసినందుకు గాను 2019లో అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాలు అందుకున్నాను. ఆర్‌ఎంపీగా విధులు నిర్వర్తిస్తుండడంతో ప్రథమ చికిత్స చేసిన వారితోనూ రక్తదానం చేయాలని సూచించి, వారే స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాను. ఇప్పటికే 90 సార్లకు పైగా రక్తదానం చేశాను. అవసరమైన వారికి రక్తకణాలు ఇచ్చాను.

– ములుకాల కుమార్, మంచిర్యాల

అత్యవసరం ఉంటే వెంటనే



రక్తదానం చేయాలని ఉన్నా కొందరు ధైర్యంగా ముందుకు రారు. నేను స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతోపాటు ఎక్కడ రక్తం అవసరం ఉందని తెలిసినా వెంటనే వెళ్లి ఇస్తాను. ఇప్పటివరకు 25సార్లు రక్తదానం, ఐదుసార్లు రక్తకణాలు అందించాను. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి హానీ ఉండదని ప్రజలకు వివరిస్తున్నాను. నా బ్లడ్ గ్రూప్ ఏబీ పాజిటివ్ చాలా అరుదుగా ఉంటుంది. ఏ సమయంలోనైనా రక్తం ఇచ్చేందుకు ఎంత దూరమైనా వెళ్లి ఇస్తున్నా.

– షారుఖ్‌ఖాన్, మంచిర్యాల

రక్తదానం, రక్తకణాలు ఇస్తున్నా



రక్తదానంపై అవగాహన ఉండడంతో బీ పాజిటివ్ గ్రూప్ రక్తం కలిగిన నేను ఇప్పటికీ 21 సార్లు రక్తదానం చేశాను. రక్తకణాలు అవసరం ఉన్న వారికి 8 సార్లు ఇచ్చాను. మా బ్లడ్ డొనేషన్ గ్రూపు ద్వారా ఎవరు రక్తం అవసరం ఉందని అడిగినా వెంటనే వెళ్లి రక్తదానం చేస్తున్నాం.

– జడల సుధాకర్, నస్పూర్

మూగజీవాలు తరలిస్తున్న వాహనాల పట్టివేత



వాహనంలో ఉన్న మూగజీవాలు

మందమర్రిరూరల్: కొటాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పరిమితికి మించి మూగజీవాలను తరలిస్తున్న రెండు వాహనాలను మందమర్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో గురువారం జాతీయ రహదారి మందమర్రి టోల్‌ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. రెండు డీసీఎం వాహనాల్లో పరిమితికి మించి మూగజీవాలు ఉన్నాయి. వాహనాల చోదకులు ఎండీ.హైమద్, సయ్యద్ హాలీమ్(బహదూర్‌పుర, హైదరాబాద్), వారి సహాయకుడు మీర్జా జావేద్(లక్ష్మీనగర్, వాంకిడి), మూగజీవాల సరఫరా సాధిక్(వాంకిడి)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దండేపల్లిలో..

దండేపల్లి: మండలంలోని గూడెం అటవీ చెక్‌పోస్టు వద్ద గురువారం ఎస్సై భూమేష్ వాహన తనిఖీలు చేపట్టారు. ఎడ్లను తరలిస్తున్న వ్యాను పట్టుకున్నారు. నిబంధనల ప్రకారం వాహనంలో 12 పశువులు తరలించాల్సి ఉండగా, 18 ఎడ్లను తరలిస్తున్నారు. ఓవర్ లోడ్ కింద వ్యాను డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి, ఎడ్లను మేదరిపేట గోశాలకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

బెల్లంపల్లిరూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు జైలు శిక్ష పడినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. గురువారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. ఇటీవల తాళ్లగురిజాల పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి ముఖేష్ వారికి రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. సమావేశంలో తాళ్లగురిజాల ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

శ్రీరాంపూర్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రిసిప్షన్‌లో రికార్డులు పరిశీలించారు. కేసుల సంఖ్య, ఛేదించిన కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, సమస్యాత్మక ప్రాంతాల వివరాలపై అడిగి తెలుసుకున్నారు. బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సైలు సంతోష్, ప్రసన్న పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణపై ఆందోళన



కుభీర్‌లోని వివేకానంద చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న దళితులు

కుభీర్: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో పార్డి(కె)గ్రామానికి చెందిన దళితులు తమను గ్రామస్తులు సాంఘిక బహిష్కరణ చేశారని గురువారం ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్డి(కె)లో రెండు నెలలుగా ఎస్సీలకు(అంబేద్కర్ సామాజికవర్గం)వారికి అంబేద్కర్ విగ్రహం వద్ద కట్టే ప్రహరీ విషయంలో వివాదం ఏర్పడింది. ఆ విగ్రహానికి కొంత దూరంలో ఒక చబుత్రపై మారెమ్మ చిన్నపాటి విగ్రహం ఉంది. ఇరువర్గాల వారు అధికారుల దృష్టికి తీసుకురాగా అధికారులు పరిష్కారం కోసం చాలాసార్లు నచ్చజెప్పారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన 10 మందిపై అట్రాసిటీ కేసునమోదు చేశారు. ఇటీవల డివిజన్‌స్థాయి అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. తమకు మందిరంలో పెళ్లి చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు. దానికి గ్రామస్తులు పూజలు కానీ పెళ్లి కానీ హిందు ధర్మం ప్రకారం చేసుకోవాలని తెలిపారు. తాము బౌద్ధ ధర్మం ప్రకారం చేసుకుంటామంటే గ్రామస్తులు ఒప్పుకోలేదు. చేసేదిలేక అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి గ్రామస్తులు తమతో మాట్లాడడం లేదని, పనులకు పిలవడం లేదని తెలిపారు. సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం.సోము, ఎస్సై పి.రవీందర్ నిరసనకారులతో మాట్లాడారు. నీటి, కరెంట్ సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: రూ.3,15,150 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన షేక్ అఫ్సర్ పట్టణంలోని ఖుర్షపూర్ కాలనీకి చెందిన అక్రం, మన్సూర్ వద్ద నిషేధిత పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేశాడు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలోగల ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు తీసుకున్న గదిలో నిల్వ చేశాడు. ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుందామని ప్లాన్ వేశాడు. కానీ.. ఇంతలోనే సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి గదిలో నిల్వ చేసిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అఫ్సర్‌ను అరెస్ట్ చేయగా, అక్రం, మన్సూర్ పరారీలో ఉన్నారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

భీమారం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని అంకూసాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థుల సంఖ్యపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

నర్సరీ సందర్శన

మద్దికల్‌లో గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన హరితహారం మొక్కల నర్సరీని అదనపు కలెక్టర్ రాహుల్ సందర్శించారు. వర్షాకాలంలో ప్రజలకు అందించే మొక్కలను జాగ్రత్తగా పెంచాలని కార్యదర్శిని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నల్లాల వివరాల యాప్‌లో నమోదును పరిశీలించారు. ఎంపీడీఓ రాధా రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందూ యాత్రికులపై దాడి అమానుషం



వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 9న కశ్మీర్‌లోని వైష్ణోదేవి కత్రా నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఉగ్రవాదుల దాడి అమానుషమని, రాష్ట్రపతి వెంటనే తగిన చర్యలు తీసుకునేలా చూడాలని విశ్వహిందూ పరిషత్ మంచిర్యాల జిల్లా సమితి సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందించారు. దేశంలో కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఇలాంటి చర్యకు పాల్పడడంపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రేవెల్లి రాజలింగు, జిల్లా కార్యదర్శి వేముల రమేశ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీకి యత్నం

మంచిర్యాలక్రైం: పట్టణంలోని కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్న వంగల రమేష్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. బుధవారం రాత్రి హీరోహోండా హెచ్‌డీ డీలక్స్ వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు బండి హ్యాండిల్ లాక్ పగుల కొట్టి కొంతదూరం నడిపించుకుంటూ వెళ్లి స్టార్ట్ చేయాలని ప్రయత్నించారు. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో అక్కడే బండిని వదిలి వెళ్లారు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: అప్పుల బాధ భరించలేక పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన రామటెంకి రవికుమార్(28) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రవికుమార్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కూలీ డబ్బులు సరిపోక అప్పులు చేశాడు. అప్పు చెల్లించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆయనకు భార్య సంతోషి, కుమారుడు శ్రీచరణ్, కూతురు సహస్ర ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆఖరి గింజ వరకు కొనుగోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ఇప్పటి వరకు నిర్దేశిత లక్ష్యానికి చేరువలో ఉన్నామని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 24,532 మంది రైతుల నుంచి 1,56,116 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి రైస్‌మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. సంబంధిత రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని తెలిపారు. 1,40,448 మెట్రిక్ టన్నుల ధాన్యం, 23,922 మంది రైతుల వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేశామని తెలిపారు.

ఓపెన్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో 575 మంది విద్యార్థులకు గాను 210 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 1201 మందికి గాను 500 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రీకౌటింగ్ కోసం ఈ నెల 18 నుంచి 27వరకు ఇంటర్ విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. విద్యార్థులు ఫలితాలను www.telanganaopen school.org మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఎన్‌ఈపీపై అవగాహన పెంచుకోవాలి

జన్నారం: జాతీయ విద్యవిధానం(ఎన్‌ఈపీ) 2020పై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని ఎన్‌సీటీఈ రీజినల్ కమిటీ సభ్యులు, మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డీఎన్ డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రేనింగ్ ప్రొఫెసర్ వనజ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యావిధానం 2020పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సవిత, ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తిరుపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: గణతంత్ర దినోత్సవం-2025 వేడుకల్లో పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. అన్ని శాఖల పరిధిలో పద్మ అవార్డులకు నిర్ణీత నమూనాలో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలను ఆన్‌లైన్ https://padmaawards.gov.in లో సంప్రదించాలని తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన కర్ర లోడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు నేషనల్ హైవే బైపాస్ రోడ్డులో గురువారం తృటిలో ప్రమాదం తప్పింది. మంచిర్యాల వైపు నుంచి తాండూర్ వైపు కర్ర లోడుతో వెళ్తున్న ఓ ఐచర్ వ్యాన్ సేయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల ప్రధాన గేట్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. కర్రలు రోడ్డుపై పడిపోగా వ్యాన్ పక్కకు ఒరిగింది. తెల్లవారుజామున ఆకస్మికంగా రోడ్డుపై గేదె అడ్డం రావడంతో ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. నేషనల్ హైవే సిబ్బంది వాహనాలను దారి మళ్లించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని టూటౌన్ ఎస్సై తెలిపారు.

నమ్మించి.. రేషన్ బియ్యం అంటగట్టి

కాగజ్‌నగర్‌రూరల్: తక్కువ ధరకు జైశ్రీరాం బియ్యం(సన్నరకం) ఇస్తామని నమ్మబలికి రేషన్ బియ్యం అంటగట్టిన ఘటన గురువారం పట్టణంలోని కాపువాడలో వెలుగు చూసింది. జైశ్రీరాం బియ్యం తక్కువ ధరకే అమ్ముతామంటూ ఇద్దరు యువకులు కాపువాడలో తిరిగారు. వీరి మాటలు నమ్మిన అదే కాలనీకి చెందిన మహిళలు సునీత, బాయక్క, పద్మ, రమ్య నలుగురు కలిసి క్వింటాల్ బియ్యం కొన్నారు. ఇంట్లోకి వెళ్లి బస్తా విప్పి చూడగా అందులో రేషన్ బియ్యం ఉండటంతో కంగుతిన్నారు. మోసపోయామని గ్రహించి రేషన్ బియ్యం అంటగట్టిన ఇద్దరు యువకుల కోసం గాలించారు. అయినా వారి జాడ దొరకలేదు. కారులో వచ్చిన ఇద్దరు యువకులు సన్న బియ్యం శాంపిల్‌గా చూపించి, జైశ్రీరాం స్టిక్కర్‌తో ఉన్న బ్యాగుల్లో రేషన్ బియ్యాన్ని పోసి తమకు అంటగట్టారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే
గత 17 సం॥రాల నుండి మంచిర్యాల జిల్లాలో అత్యధిక కోర్సులు...
అత్యధిక ప్లేస్‌మెంట్ ఇస్తున్న పారామెడికల్ కాలేజీలు
మంచిర్యాల వొకేషనల్ జూనియర్ కాలేజి
ఇందిరానగర్ బస్టాండ్ ముందు, CMR షాపింగ్ మాల్ పక్క సందు, మంచిర్యాల.
సెల్: 9848735766, 9390310176
1. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (MLT)
2. MPHW(F)/ANM ఫిమేల్ నర్సింగ్
3. అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ (ACP)
4. లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్-డైరీ (LMDT), వెటర్నరీ అసిస్టెంట్
5. ఎలక్ట్రీషియన్ + టెక్నీషియన్/ లైన్‌మెన్
6. కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ (CT) సివిల్ సర్వేయర్
7. కంప్యూటర్ సైన్స్ + ఇంజనీరింగ్ CSE
అర్హత: SSC /Open SSC Pass
శ్రీసాయి MPHA & మంచిర్యాల పారామెడికల్ కాలేజెస్
ఇందిరానగర్, మంచిర్యాల, సెల్: 8688822111, 9390310176
1. డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (DMLT)
2. డిప్లమా ఇన్ ఇమేజింగ్ టెక్నీషియన్ (DMIT)
3. డిప్లమా ఇన్ ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ (DMST)
4. డిప్లమా ఇన్ మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (మేల్)/ సానిటరీ ఇన్‌స్పెక్టర్ (DMPHA)
5. డిప్లమా ఇన్ ఆప్తాల్మిక్ టెక్నీషియన్ (DOA)
6. డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (DANS)
అర్హత: Inter Pass / Vocational Inter Pass/ Open Inter
Dr. P.Srinivas
M.D, M.Sc (Psychology),
Correspondent & Principal
Mancherial
Cell: 9848735766, 868882211, 9390310176

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
BUSINESS OFFER
■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ కార్నర్ షాప్, టీవీ డైవర్ ... (Govt. అప్రూవ్డ్)
8376001873, 9643010487, 8376089771, 011-25920179
[DA-5787]
WANTED
■ ప్రముఖ కంపెనీలో ... 95026 15217
[M-1185211]
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించుకొని పెదప ప్రత్యుత్తరం ... ప్రకటనదారు తెలిపే లేదా ఇతర వ్యక్తుల ... ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462